www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 3 జనవరి 2026

5

అన్నమయ్య





రైతుకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాన్ని అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్

టిఫిన్ బండ్లపై 'బండ' బాదుడు



- తాజాగా వాణిజ్య గ్యాస్‌పై రూ.111 పెంపు
- ఇడ్లీ, మిర్చి, దోశ బండ్ల వ్యాపారుల ఆందోళన
- కేంద్ర ప్రభుత్వ తీరుపై సర్వత్రా నిరసన

కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని విస్మరించి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతుండడంతో చిరువ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది. వ్యాపారం మానుకోలేక మనుగడ కొనసాగించలేక సతమతమవుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న గ్యాస్ ధరలతో రోజు కూలీ కూడా గిట్టుబాటు కాకపోవడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఆవేదన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్పాహారమైన ఇడ్లీ, దోశ, మిర్చి బండ్లు నిర్వహించే వ్యాపారులు పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచితే వ్యాపారం దెబ్బ తింటుందేమోనన్న భయంతో నష్టాల్లోనే వ్యాపారం కొనసాగిస్తున్నారు. ప్రజలు ఆర్థికంగా చిక్కి శల్యమవుతున్న తరుణంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరు మరింత ఆవేదనకు గురిచేస్తుంది.

ప్రజాశక్తి - యంత్రాంగం

వాణిజ్య అవసరాలకు వినియోగించే వంట గ్యాస్ ధర (19 కిలోల) సిలిండర్‌పై రూ.111 చొప్పున పెంచుతున్నట్లు ఇంధన సంస్థలు ప్రకటించాయి. వాణిజ్య సిలిండర్‌పై ఇష్టమొచ్చినప్పుడల్లా ధర పెంచుతూ పోతున్న విషయం తెలిసిందే. చిరువ్యాపారులు, హోటల్ యజమానులపై భారం పడింది. ఇది వారికి గుదిబండగా మారింది. అసలే వ్యాపారం అంతంతమాత్రమే ఉండగా సిలిండర్ ధర పెంపు, నిత్యావసర సరకుల ధర పెరగడంతో వారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. రోజుకు ఇద్దరు వర్కర్లకు రూ.1200 ఖర్చు అవుతుండగా పెట్టుబడి పోను కూలీ మాత్రమే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోశ, ఇడ్లీ, బొండ, గారె, మిర్చి వంటి పదార్థాలు ఎక్కువగా ప్రజలు వేడి వేడిగా కోరుకుంటారు. ఈ పదార్థాలను ఎప్పుడూ వేడిగా ఉంచాలంటే గ్యాస్ స్టవ్ ఎప్పుడు ఆన్‌లోనే ఉండాల్సి ఉంటుంది. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి రోజుకు సిలిండర్‌కు రూ.1,733 చెల్లించాల్సి వస్తుండగా డబ్బులు సగం గ్యాస్‌కే పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన రూ.111తో రూ.1,844గా ఉంది. గ్యాస్, నిత్యావసర ధర పెరగడంతో ఆహార పదార్థాల రేట్లు పెంచలేక, వ్యాపారం మానుకోలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

ఇబ్బందిగా గ్యాస్ ధరలు

గ్యాస్ సిలిండర్ ధరలు తరచూ పెంచడం చాలా ఇబ్బందిగా మారింది. పెద్ద మొత్తంలో డబ్బులు కట్టి సిలిండర్ తీసుకోవాలంటే భయమేస్తుంది. ధరలు తగ్గకుంటే మళ్ళీ కట్టెల పొయ్యినే వాడాల్సి వస్తుంది. సిలిండర్‌తో పాటు విద్యుత్, బస్సు ఛార్జీలు, నిత్యావసర ధరలు పెరిగాయి. చాలా ఇబ్బంది పడుతున్నాం.

- కుమారి, చిరు వ్యాపారి, కమలాపురం.

గ్యాస్ ధరలు భారమవుతున్నాయి

సిలిండర్ ధర ఒక్కసారిగా రూ.111 పెంచారు. కొంత కాలంగా గ్యాస్ ధరలను పెంచు తుండడంతో భారమవుతున్నది. వ్యాపారాలు అంతంత మాత్రమే జరుగుతున్నాయి. ఈ పరిస్థితులలో ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి గ్యాస్ ధరలు తగ్గించాలి .

- పండు, టి హోటల్ నిర్వాహకుడు, మైదుకూరు.

పెంచిన సిలిండర్ ధరను తగ్గించాలి

19 కిలోల వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ధరను ప్రభుత్వం రూ.111 పెంచింది. ఈ సిలిండర్ గతంలో రూ.1770గా ఉన్న ధర ఇప్పుడు రూ.1881కి చేరుకుంది. వాణిజ్య ఎల్‌పిజి ధరల్లో చేసిన సవరణల కారణంగా వాటిపై ఆధారపడుతూ వ్యాపారాలు చేసుకునే మాలాంటి వారిపై ఆర్థిక భారం పడనుంది. ఈ ప్రభావం కొనుగోలు చేసే సామాన్యులపై కొంత వరకు ఉంటుంది. ప్రభుత్వం గ్యాస్ ధరలను తగ్గించి చిరు వ్యాపారులను ఆదుకోవాలి.

- చాన్‌బాష, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు, చాపాడు.

చిరు వ్యాపారులపై భారం తగ్గించాలి

కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచడంతో చిరు వ్యాపారాలపై పెద్ద ఎత్తున భారం పడుతుంది. కొన్ని నెలలుగా ఒక గ్యాస్ సిలిండర్‌పై విపరీతంగా ధరలు పెంచడంతో మాలాంటి చిరు వ్యాపారాలు చేసుకునే వారిపై భారం పడుతుందని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతున్నాం.

- శ్రీనివాసులు, చిరు వ్యాపారి, కడప.

వ్యాపారం సజావుగా జరగలేదు

గ్యాస్ సిలిండర్ ధర రూ.111 పెంచడంతో మాలాంటి చిరు వ్యాపారులపై భారం పడుతున్నది. ఉపాధి కోసం హోటల్ నడుపుతున్నా. గతేడాది వ్యాపారం సజావుగా జరగలేదు. ఇప్పుడు సిలిండర్ ధర పెంచడంతో నెలకు రూ.1500 అదనంగా చెల్లించాల్సి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ధరలు తగ్గించి చిరువ్యాపారులను ఆదుకోవాలి.

- జిలానీ బేగం, బజ్జీ కొట్టు, కడప.

ధరలు పెంచలేం.. వ్యాపారం మానుకోలేం

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు భారంగా మారాయి. వ్యాపారం పుంజుకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న ధరలతో వ్యాపారాలు నిర్వహించే పరిస్థితి లేదు. లాభం రావాలంటే రేటు పెంచడం తప్ప మరో మార్గం లేదు. రేటు పెంచితే వ్యాపారం దెబ్బ తింటుందని భయంగా ఉంది.. ఇది తప్ప వేరే పని చేయలేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం. ధరలను తగ్గిస్తే బాగుంటుంది.

- కిషోర్‌కుమార్‌రెడ్డి, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు, కడప.

టిఫిన్ సెంటరే జీవనాధారం

టిఫిన్ సెంటర్‌ను నడుపుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాము. రోజంతా కష్టపడితే ఖర్చులు పోను రూ.300 మిగులుతుంది. గ్యాస్ ధరలు పెంచితే ఇక మాకు కూలి కూడా గిట్టదు. టిఫిన్ సెంటర్ మూసేసి వేరే పని చూసుకోవాల్సిందే.

- యశోధ, టిఫిన్ సెంటర్ నిర్వాహకులు, మదనపల్లె.

గ్యాస్ కొనాలంటే గుదిబండే

నిత్యావసర వస్తువులతోపాటు గ్యాస్, కూరగాయల ధరలు అమితంగా పెరిగాయి. వ్యాపార వినియోగ గ్యాస్ ధర భారీగా పెరగడంతో హోటల్ నడపడం చాలా భారంగా ఉంది. ఇలానే కొనసాగితే హోటల్ యాజమానులు అప్పుల పాలయ్యే ప్రమాదం ఉంది.పెంచిన గ్యాస్ బండ ధరను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలి

- రామకృష్ణ, హోటల్ నిర్వాహకుడు, రాయచోటి

నెలకు 12 సిలిండర్లు ఇవ్వాలి

నెలకు 12 సిలిండర్లు కావాలి. ఆ లెక్కన నెలలో రూ.సుమారు రూ.1350 నెలకు భారం పడుతుంది. ఈ భారం ఎవరిమీద వేయాలి. టిఫిన్ క్వాలిటీ అయినా తగ్గించాలి, ధర అయినా పెంచాలి. ఈ రెండింటిలో ఏది జరిగిన హోటల్ మూతపడుతుంది. గ్యాస్ ధర తగ్గించి సామాన్యుడిని ఆదుకోవాలి.

- చిన్నోడు, హోటల్ నిర్వాహకుడు, మదనపల్లె.

ధర పెంపు వల్ల అనదపు భారం

గ్యాస్ ధర పెంపు వల్ల అదనపు భారం పడుతుంది. ఇప్పటికే నిత్యావసర, కూరగాయలు ధరలు పెరిగాయి. గ్యాస్ ధర పెరగడం వల్ల వచ్చే ఆదాయం దగ్గి కుటుంబ పోషణ భారంగా మారనుంది. ప్రభుత్వాలు ఆలోచించి చిన్న వ్యాపారులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి

- పి.బాబు, చికెన్ పకోడి బండి, పులివెందుల.

ధర పెంపుతో మరింత భారం

రోజువారీగా తయారీకి అవసరమయ్యే సరుకుల ధరలు పెరిగాయి. అదే రీతిలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడంతో హోటళ్ల నడిపించడం మరింత భారంగా మారింది. హోటల్ నిర్వహణకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నా తప్పని పరిస్థితిలో హోటల్‌ను నడిపిస్తున్నాం. ధరలు పెరుగుతూ పోతే హోటల్‌కు గిరాకీ తగ్గి బతుకు భారంగా మారుతుంది. ధరల తగ్గింపునకు చర్యలు తీసుకోవాలి.

- బాబ్జీ, టి హోటల్ నిర్వాహకుడు, వేంపల్లె.

వ్యాపారంలో మిగులు లేదు

నిత్యావసర సారుకులతో పాటు గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంతో వ్యాపారంలో మిగులు లేదు. కుటుంబ పోషణ భారమైంది. నాయకులు చిరు వ్యాపారులకు గ్యాస్ ధరలు వెంటనే తగ్గించి వీధి వ్యాపారులకు ఆదుకోవాలని కోరారు. టిఫిన్ సెంటర్ మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ఇలా గ్యాస్ ధరలు పెంచుకుంటూ పోతే ఎలా?

- సుగుణమ్మ, టిఫిన్ సెంటర్, ప్రొద్దుటూరు.

సాంకేతికతతో భూ వివాదాలకు చెక్

- పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

నూతన పట్టాదారు పాస్ పుస్తకాలతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆధునిక సాంకేతికత జోడింపుతో భూ వివాదాలకు చెక్ పెట్టగలుగుతామని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంకిశెట్టిపల్లి గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటు అనంతరం అంకిశెట్టిపల్లి గ్రామంలో మొట్టమొదటి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మదనపల్లె, చుట్టుప్రక్కల ప్రాంతాలలో ముఖ్యమైన సమస్య భూ సమస్య అని, ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో అధునాతన సాంకేతికత ద్వారా భూ సమస్యలను, వివాదాలను పరిష్కరించగలుగుతామన్నారు. ఈ అధునాతన సాంకేతికతతో సెంటీమీటర్ కూడా తేడా జరగకుండా రీసర్వే నిర్వహిస్తామన్నారు. అధునాతన సాంకేతికత ద్వారా రైతుకు ఎంత భూమి ఉంది, ఎక్కడ ఉంది తదితర అంశాలను చాలా స్పష్టంగా, సులభంగా గుర్తించగలుగుతామన్నారు. జిల్లా ఏర్పాటు అనంతరం యాదృచ్ఛికంగా ఈ ప్రాంతంలో ముఖ్య సమస్య అయిన భూ సమస్య పైనే మొదటి కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, భూ సమస్యల పరిష్కారానికి ఇది ఒక నాందిగా ఉంటుందన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందని పేర్కొన్నారు. రెవెన్యూ గ్రామ సభలను సచివాలయ స్థాయిలో నిర్వహిస్తున్నామని ప్రజలందరూ ఈ కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకాలలో తప్పులు దొర్లితే వాటిని అర్జీ పెట్టుకొని పరిష్కరించుకోవచ్చని సూచించారు. మ్మెల్యే షాజహాన్‌బాషా రెవెన్యూ సమస్యల పరిష్కారంతోనే రైతులు ఆనందంగా ఉంటారని, కూటమి ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. గత ప్రభుత్వం డికెటి భూములను స్వప్రయోజనాలకు ఉపయోగిం చుకున్నారని, కూటమి ప్రభుత్వం డికెటి భూము లను భూమిలేని రైతులకు అందించి, ఎంతో పారద˘ర్శకంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. మదనపల్లె వాసుల కోరిక మేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లి అని వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లా డుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ గ్రామసభలను ఈ నెల 2 నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమాల ద్వారా రాజ ముద్ర కలిగిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలు ప్రజలకు అందిస్తోందని పేర్కొన్నారు. నూతన పాసు పుస్తకాలలో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని వెంటనే పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. రాజముద్రతో పాస్ పుస్తకాలు ముద్రించి, రైతులకు ప్రభుత్వం అందిస్తోందని మార్కెట్ యార్డ్ చైర్మన్ జంగాల శివరామ్ తెలిపారు. అనంతరం అంకి శెట్టిపల్లి గ్రామానికి చెందిన రైతులకు కలెక్టర్, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చేతుల మీదుగా నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు, ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రాధిక

టిబి నియంత్రణకు చర్యలు

- అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రాధిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలో టిడి నియంత్రణకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రాధిక పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని టిబి యూనిట్, ఎఆర్‌డి, ఐసిటిసి సెంటర్లను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1400 మంది టిబి వ్యాధిగ్రస్తులకు మందుల ద్వారా ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. 65 మంది టిబి, హెచ్ఐవి పేషెంట్లు ఉన్నారని, 35 మంది మొండి టిబి వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. టిబి యూనిట్ సిబ్బంది ఎఆర్‌డిసి సిబ్బందితో సమన్వయం చేసుకొని టిబి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తామన్నారు. వీరికి వెంటనే గల్ల పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలల పాటు ప్రభుత్వ మందులు అందజేస్తూ టిబి నియంత్రణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి పౌష్టికాహారం కోసం రూ.6 వేలు నగదు అందజేస్తున్నామన్నారు. నిశ్చక్షయమిత్రలను ఎంపిక చేసి టిబి రోగులను దత్తత తీసుకొని వారికి పౌష్టికాహారం అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 130 మంది నిశ్చయమిత్రలు ఉన్నట్లు తెలిపారు. మరింత మంది ఉదార స్వభావులు, సేవా గుణం కలవారు నిక్షయమిత్రలుగా రిజిస్టరై టిబి వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని వారి సంపూర్ణ ఆరోగ్యం కొరకు కృషి చేస్తూ, తమ వంతు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్‌బిఎస్‌కె, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ శివప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో 14 ఏళ్లలోపు చిన్నారులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామన్నారు. పిల్లలకు బర్త్ డిఫెక్ట్స్, వినికిడి లోపం, చూపు మందగించడం, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారిని గుర్తించడం, శరీర లోపాలు ఉన్న వారిని గుర్తించి వారికి తగిన చికిత్సలు అందించడం జరుగుతోందన్నారు. ఆ వ్యాధి ముందుకు పోకుండా సకాలంలో నయం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని డైస్ సెంటర్‌ను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో టిబి యూనిట్ సిబ్బంది ప్రభాకర్ పాల్గొన్నారు.

రాజంపేటకు తీవ్ర అన్యాయం : జెఎసి

ప్రజాశక్తి-రాజంపేట

జిల్లాల పునర్విభజనలో రాజంపేటకు తీవ్ర అన్యాయం జరిగిందని జిల్లా కేంద్ర సాధన సమితి ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో జెఎసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రాంతాలు కూడా అసంతృప్తిగానే ఉన్నాయన్నారు. రైల్వేకోడూరు పరిధిలోని చిట్వేల్, పెనగలూరు మండలాల ప్రజలు జిల్లా కేంద్రం దూరంగా ఉంటుందని ఆవేదన చెందుతున్నారన్నారు. మదనపల్లి జిల్లాకు అన్నమయ్య పేరు వద్దని ప్రజలు అక్కడ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. రాజంపేట పరిధిలోని సుండుపల్లి, వీరబల్లి మండలాలు డివిజన్ పరిధికి దూరంగా ఉందని అసంతృప్తితో ఉన్నారన్నారు. రాజంపేట జిల్లా స్థాయికి కావలసిన అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ రాజంపేటను కుదించి ఒక సాధారణ మండల స్థాయికి వచ్చేలా ప్రభుత్వ నిర్ణయం ఉందని, దీనిపైన అధికార, ప్రతిపక్ష పార్టీలు స్పందించాలని, రాజంపేటకు, అన్నమయ్యకు గల సంబంధాన్ని ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించి రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించి ఈ ప్రాంతానికి సరైన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు చిట్వేల్ రవి కుమార్, సికిందర్, అబ్బూరి ప్రభాకర్ నాయుడు, అబూబకర్, చల్లా సుధాకర్, రాజశేఖర్ నాయక్, నీలి ఈశ్వరయ్య, నందకిషోర్, డి.ఎస్.రావు, రెడ్డయ్య నాయుడు, రవీంద్రనాయుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జెఎసి నాయకులు

రాయచోటికి న్యాయం చేయాలి

- ర్యాలీలో ముస్లిం మైనార్టీ నేతల డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

తిరిగి జిల్లా కేంద్రంగా ప్రకటించడం ద్వారా రాయచోటికి తగిన న్యాయం చేయాలని రాయచోటి జామియా మసీదు సర్కాజీ, ముస్లిం మతపెద్ద షర్ఫుద్దీన్ సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ ముస్లిం మైనార్టీ పెద్దల ఆధ్వర్యంలో రాయచోటిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద నుండి నేతాజి సర్కిల్, బస్టాండు సర్కిల్స్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా తొలగించడం ద్వారా రాయచోటికి కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. జిల్లాలో ఇక పరిపాలన కుదుట పడిందనుకుంటున్న తరుణంలో ప్రభుత్వం జిల్లా కేంద్రాన్ని అకారణంగా మదనపల్లెకు తరలించడం దారుణమన్నారు. జిల్లాను మూడు ముక్కలు చేయడం, జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుండి తరలించడం రాయచోటి వాసుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశాయంటూ మండిపడ్డారు. ఇప్పటికైనా పాలకులు ప్రజాభిప్రాయాన్ని గౌరవించి రాయచోటిని తిరిగి జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్నారు. అలా కాని పక్షంలో రాయచోటి నియోజకవర్గాన్ని కడప జిల్లాలో విలీనం చేయాలంటూ కోరారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైసిపి నేతలు జాఫర్‌అలీఖాన్, ఎస్.కె.హుస్సేన్, డాక్టర్ జక్రియాబాష మాట్లాడుతూ రాయచోటిని జిల్లా కేంద్రంగా తొలగించడం ద్వారా ఈ ప్రాంతీయుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశారన్నారు. మదనపల్లెను ప్రత్యేక జిల్లాగా ప్రటించిన తరుణంలో జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుండి మరోప్రాంతానికి ఎందుకు తరలించాల్సి వచ్చిందంటూ మండిపడ్డారు. కూటమి పాలకులు చేసిన తప్పును వెంటనే సరిదిద్దు కోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ నరసింహ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సహరా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆప్తాబ్, అమీర్, జిలాన్, వైసిపి నేతలు నవాజ్‌క్రిష్, రోటరీ రియాజ్, టిడిపి నేత బోనమల ఖాదర్‌వలీ, జాఫర్‌అలీఖాన్, ఎజాస్ ఖాన్, అత్తావుల్లా, పెద్దఎత్తున ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

ప్రజల మనోవేదనపై ప్రభుత్వం స్పందించాలి : 'గడికోట'

రాయచోటి జిల్లా కేంద్రం మార్పుపై ప్రజల్లో నెలకొన్న తీవ్రస్థాయి మనోవేదనను చూసైనా ప్రభుత్వం స్పందించాలని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించడం మంచిపద్ధతన్నారు. ప్రజల ఆవేదనను అర్థం చేసుకుని, వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం రెండు రోజులుగా సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలని హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాయచోటి ప్రాంతానికి ప్రభుత్వం చేసిన అన్యాయంపై న్యాయస్థానాలు న్యాయం చేస్తామన్న పూర్తినమ్మకం తమకు ఉందన్నారు. జిల్లా కేంద్రం మార్పు విషయంలో రాయచోటి ప్రజల అభిప్రాయాలు ఎక్కడా సేకరించలేదని, నోటిఫికేషన్‌లో కూడా రాయచోటి ప్రస్తావన లేకపోవడం గమనార్హమన్నారు. జిల్లా కేంద్రం మార్పు అంశంపై కోర్టులో తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అన్యాయంపై జరుపుతున్న న్యాయ పోరాటంలో విజయం తప్పక వరిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు.

'సీమ' అభివృద్ధికి కృషి చేయాలి :'చింతా'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని, మైక్రోసాఫ్ట్ కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేస్తే నిరుద్యోగాన్ని నిర్మూలించవచ్చునని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవులతో చంద్రబాబు, వైఎస్ఆర్ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగాయని, ఆరేళ్ల నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా రాయలసీమ అభివృద్ధికి ఏమి చేయలేదన్నారు. చిత్తూరు జిల్లా నుంచి చంద్రబాబు నాయుడు 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా రాయలసీమ అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. మూడేళ్ల ముఖ్యమంత్రిగా కిరణ్ కుమార్‌రెడ్డి మాటలతో కాలం గడిపారని, ఐదేళ్లు జగన్, కర్నూలు నుంచి విజయభాస్కర్‌రెడ్డి, దామోదరం సంజీవయ్యలు సిఎంలుగా పనిచేశారని, 40 ఏళ్లు రాయలసీమ ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పరిపాలించినా సొంత ప్రాంతాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. రాయలసీమ, రతనాలసీమగా మార్చే శక్తి సత్య నాదెళ్లకే ఉందని, తాను సత్య నాదెళ్లకి ఫోన్ చేసి, మాట్లాడానని, చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుంటే నిరుద్యోగ సమస్యను అధిగమించవచ్చన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రెడ్డి సాహెబ్, రవి, యమలా సుదర్శన్, డాక్టర్ ఎస్.కె.బాషా, మీనాకుమారి, ముబారకారన్, మహబూబ్‌పీర్, శరత్, పాలేటి నాగరాజు, బి.నాగరాజు, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

యువకుడిపై పోలీసుల దాష్టీకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



పోలీసుల దాడిలో గాయపడిన బాధితుడు మహేష్

గ్రామంలో అర్ధరాత్రి జరుగుతున్న గొడవను వీడియో తీసి సిఐకు పంపిన పాపానికి ఓ యువకుడిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి ఇష్టప్రకారం లాఠీలతో చితకబాదారు. ఈ సంఘటన శుక్రవారం పెద్దమండ్యం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. పెద్దమండ్యం మండలం, వెలుగల్లు పంచాయతీ గురికివాండ్లపల్లెలో గురువారం రాత్రి రామాలయం వద్ద చీటీ నిర్వహిస్తున్నారు. ఈ చీటీలో కొంతమంది గ్రామస్తులు గొడవపడి, గట్టిగట్టిగా అరుస్తూ కేకలు వేస్తూ నానా రభస చేయడంతో స్థానికంగా ఉంటున్న మహేష్ ఆ గొడవను వీడియో తీసి తమ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందంటూ గుర్రంకొండ సిఐకి పోస్ట్ చేశాడు. శుక్రవారం పెద్దమండ్యం ఎస్ఐ శ్రావణి మహేష్‌కు ఫోన్ చేసి స్టేషన్ కు పిలిపించింది. స్టేషన్ కు వెళ్లగానే గొడవను ఎవరు నిన్ను చిత్రీకరించమన్నారు, సిఐకి ఎందుకు పోస్ట్ చేశావంటూ నానా దుర్భాషలాడారు. అంతటితో ఆగకుండా మహేష్‌ను సెల్లో వేసి ఇద్దరు కానిస్టేబుళ్లతో లాఠీలతో కొట్టించారు. మరోసారి ఇలా చేశావంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించి పంపించేశారు. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి బాధితునికి న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేశారు.

పూలే జయంతిని విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్ : చదువుల తల్లి, క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే జయంతిని అన్ని పాఠశాలల్లో విజయవంతంగా నిర్వహించాలని బిటిఎ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ అబ్దుల్‌రజాక్ ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం బిటిఎ నేతలు రాయ చోటితో చుట్టుపక్కల మండలాల్లోని వంద మంది ఉపాధ్యాయులకు బిటిఎ ఆధ్వ ర్యంలో సావిత్రిబాయి చిత్రపటాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బాలికలు, మహిళల విద్యకోసం అహర్నిశలు శ్రమించిన వీరవనిత సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. సమాజంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలు, అవిద్యను దూరం చేసి సమతా సమాజం కోసం నిరంతరం శ్రమించిన ధీశాలి సావిత్రిబాయన్నారు. మహిళల విద్యకోసం సావిత్రిబాయి చేసిన అందరూ గుర్తెరిగేలా చేసేందుకే ఆమె చిత్రపటాలను పాఠశాలలకు అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిటిఎ జిల్లా అధ్యక్షుడు పల్లం రామచంద్ర, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి సి.వి.రమణ పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అవకాశం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని, పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు అవకాశం కల్పిస్తామని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లిని ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ప్రజలకు, జనసేన కేడర్‌కు ఏ సమస్య వచ్చినా ఐదు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు ఐకమత్యంగా ఉండి, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామన్నారు. నెలలో రెండుసార్లు నియోజకవర్గ, మండల, వార్డు, గ్రామ స్థాయిలో జనవాని కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమస్య ఏదైనా పోరాడి, ఆఖరకు పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు ఇన్‌ఛార్జులు దినేష్, సాయినాథ్, చిన్న రాయల్, మదనపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్, రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జనసేన నాయకులు కళ్యాణ్, సనా వుల్లా, గజ్జల రెడ్డప్ప, రోణురు బాబు, బండి మనోహర్, లక్ష్మీనారాయణ, నాయని జగదీష్ పాల్గొన్నారు.


కుటుంబ సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ

పక్కాగా ప్రభుత్వ సర్వే : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వే కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగులు పక్కాగా నిర్వహించాలని ఎంపిడిఒ ఫక్రుద్దీన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఎఒ రమేష్‌బాబు, గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒ లక్ష్మీపతితో కలసి బండ్లపై సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం నిమ్మనపల్లిలో సచివాలయ ఉద్యోగులు చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను, వాట్సప్ గవర్నెన్స్ అవగాహన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో సమయానికి హాజరు వేయాలని సూచించారు. కొంతమంది ఉద్యోగులు విధి నిర్వహణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికే అటువంటి వారిని పలు దఫాలుగా హెచ్చరించినట్లు తెలిపారు. అటువంటి వారిలో మార్పురాకుంటే తాము తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు చేపడుతున్న ప్రభుత్వ సర్వేలను వేగంగా, సమగ్రంగా చేయాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వేను కుటుంబ యజమా నులతో స్వయంగా చర్చించి వారిచ్చిన వివరాలను నమోదు చేసుకోవాలని వారి నుంచి ఇకెవైసి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడానికి తీసుకువచ్చిన వాట్సప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రామాంజనేయచారి

మట్టి నమూనా పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

మట్టి నమూనాల సేకరణ పరీక్షలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని భూసార పరీక్ష కేంద్రం అధికారి ఎస్.రామాంజనేయచారి, ఎఒ నాగమణి పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఎఒ ఆధ్వర్యంలో 8, 9 తరగతుల విద్యార్థులకు భూసార పరీక్షల ఆవశ్య కతపై అవగాహన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి భూసార పరీక్ష కేంద్రం అధికారి ఎస్.రామాంజనేయచారి మాట్లాడుతూ వ్యవసాయభూమి నాణ్యతపై ఆధారపడి ఉంటుం దన్నారు. సరైన పద్ధతిలో పద్ధతిలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షిస్తే పంటలకు అవసరమైన ఎరువుల పరిమాణం సరిగా నిర్ణయించుకొవచ్చుని దీనివలన పంటల ఉత్పాదకత పెరిగి రైతులకు లాభం చేకూరుతుందని వివరించారు. విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ పద్ధతి పరీక్ష కేంద్రానికి పంపి విధానంపై డెమో రూపంలో చూపించారు. ఎఒ నాగమణి మాట్లా డుతూ మండ లంలోని ఎపిమోడల్ స్కూల్ విద్యార్థులు వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు చెంది ఉంటారని, పంట సాగు చేయడానికి ముందు భూసార పరీక్షలు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. పంటల పెట్టుబడుల ఖర్చులను తగ్గించేందుకు శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ చాన్‌బాషా, అగ్రికల్చర్ అసిస్టెంట్ మాన్సూర్ విద్యార్థులు పాల్గొన్నారు.


ఆకేపాటిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

'ఆకేపాటి'ని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కలికిరి వైసిపి నాయకులు మర్యాదపూర్వ కంగా కలిశారు. శుక్రవారం పీలేరు బిఎస్ఎన్ కల్యాణ మండపంలో వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం మండలం వైసిపి నాయకులు హనీఫ్ బాబాజీ, కె ద్వారకనాథరెడ్డి, మద్దిరాల్ల మల్లికార్జున, వేంపల్లి ఖాదర్‌బాషా, శ్యామ్యూల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

చెత్త డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని సాకి బండ గ్రామపంచాయతీలోని చెత్త డంపింగ్ యార్డును శుక్రవారం ఎంపిడిఒ ఆదినారాయణ పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా చేసుకొని వాటిని నాడ పిట్‌లో ఎలా నింపాలో అనే విషయాన్ని వివరించారు. వర్మీ కంపోస్టు తయారీ గురించి, దాని ప్రయోజనాల గురించి తెలిపారు. తడి,పొడి చెత్తలను వేర్వేరుగా ఉంచాలన్నారు. డంపింగ్ యార్డు చుట్టూ పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పూలమొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని చెప్పారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలనుశుక్రవారం డిఆర్‌డిఎ పీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ మడివి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. బోధన పరమైన విషయాలలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న అధ్యాపకులను అడిగి తెలుసుకొని దానిపై దృష్టి సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు బాధ్యతో మెలగాలని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

సేంద్రియ పద్ధతిలోనే మెరుగైన ఫలితాలు

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

సేంద్రియ పద్ధతిలోనే రైతులు వ్యవసాయం చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవ చ్చునని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో సేంద్రియ పద్ధతులతో వరి పంటను పండించి సఫలీకృతమైనట్లు తెలిపారు. పంట నారు పోసినప్పటి నుంచి, కోత దశ వరకు కృతిమ ఎరువులు, కలుపు మందులు, పురుగు మందులను వాడకుండా సహజ వనరులు, కెవికెలో వృద్ధిపరుచు జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు, ఉపయోగించి పంట పండించే ప్రణాళిక రూపొందించారు. కెవికె సిబ్బంది సహకారంతో ఆర్గానిక్ వరి పండించడంలో సఫలమయ్యారని పేర్కొన్నారు. కూనారం సన్నాలు రకాన్ని వివిధ సేంద్రియ పద్ధతులను జోడించడం వల్ల ఎకరాకు 30 బస్తాలు చొప్పున రికార్డుస్థాయిలో దిగుబడి చేశారని చెప్పారు. చీడ పీడలు ఏవీ పంటను ఆశించలేదని, నికరాదాయం ఎకరాకి రూ.51,400లు చొప్పున సాధించినట్లు వారు తెలిపారు. వేరుశనగ, కూరగాయలు పంటలు కూడా సేంద్రీయంగా పండించడానికి సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా రైతులను సేంద్రీయ వ్యవసాయానికి మొగ్గు చూపాలని తద్వారా జీవరాశులను, వాతావరణాన్ని కాపాడినవారిమౌతామని, ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చని సూచించారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న కెవికె కో-ఆర్డినేటర్ మంజుల

అవకతవకలు వెలికి తీస్తాం: 'చమర్తి'


సింగిల్ విండో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రవీణ్

ప్రజాశక్తి - నందలూరు

గత వైసిపి ప్రభుత్వంలో డిసిసిబి బ్యాంకులో జరిగిన అవగతవకలు వెలికి తీసి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం సింగిల్ విండో అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన పసు పులేటి ప్రవీణ్‌కుమార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ టిడిపిలో కష్టపడిన పనిచేసిన వారికి గుర్తించి పదవులు ఇవ్వడం జరుగుతుం దన్నారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి బాటలో నడుస్తోందని అన్నారు. పసుపులేటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన చమర్తి జగన్మోహన్‌రాజుకు ముందుగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని చెప్పారు. తనకు వచ్చిన పదవికి న్యాయం చేస్తూ , రైతులకు నాబార్డు నుంచి రుణాలు వచ్చే విధంగా సహకరిస్తానని తెలిపారు. గతంలో సహకార బ్యాంకులో జరిగిన అవకతవకలు బయట పెడతానన్నారు. కార్యక్రమంలో మాజీ ఆర్‌టిసి రీజనల్ ఛైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్యానాయుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మాజీ ఎంపిపి పల్లె సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు గంట వాసుదేవయ్య, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, సయ్యద్ అమీర్, మోడపోతుల రాము, చుక్క యానాది, ఉప్పుశెట్టి రెడ్డయ్య, ఉప్పుశెట్టి సుధీర్, ముమ్మడిశెట్టి రమేష్, తాటి సుబ్బరాయుడు, మహబూబ్ బాషా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట :** మండల పరిధిలోని మునక్కాయలపల్లెలో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు సందర్శించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు చమర్తి జగన్‌మోహన్‌రాజును శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్లొమా ఫలితాల్లో సత్తా చాటిన ఎంజెఆర్ విద్యార్థులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా చేస్తున్న విద్యార్థులు సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటారని కళాశాల చైర్మన్ ఎంపి.అవినాష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తమ కళాశాలలో మూడవ సంవత్సరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిప్లొమా చేస్తున్న సి. భావన అనే విద్యార్థిని 1000/997 మార్కులు సాధించి అద్భుతమైన ప్రతిభ కనబరిచిందన్నారు. డిప్లొమా కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కె.మానస 900/874మార్కులు సాధించిందన్నారు. రెండవ సంవత్సరం డిప్లొమా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగా నికి చెందిన వై.చరణ్‌కుమార్ 1000/981 మార్కులు సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచారని చెప్పారు. అంతేకాకుండా పలువురు విద్యార్థులు 95శాతం పైచిలుకు మార్కులు సాధించి ఉత్తీర్ణులైనట్లు తెలియజేశారు. విద్యార్థుల విజయం వెనుక సమర్థవంతమైన బోధనా విధానాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకుల నిరంతర మార్గనిర్దేశం, విద్యార్థుల కృషి ఎందుకు ప్రధాన కారణమని చెప్పారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు ఇలాంటి అత్యుత్తమ ఫలితాలు సాధించి సంస్థ ప్రతి ష్టను, గురువుల గౌరవాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు. అన ంతరం పరీక్ష ఫలి తాల్లో సత్తా చాటిన విద్యా ర్థులను కళాశాల ప్రిన్సిపల్ కె.వి.ఎన్.వి. నరసింహారావు, డిప్లొమా ఇంచార్జ్ కె. నరేష్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం అభినందించారు.


ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు

పాస్ పుస్తకాల్లో తప్పులుంటే సరిచేసుకోవచ్చు : ఆర్‌డిఒ



తంబళ్లపల్లె : రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన పట్టాదారు పాస్ పుస్తకాలు తప్పులు ఉంటే వెంటనే అర్జీలు పెట్టుకొని సరిచేసుకోవచ్చని రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలం లోని బండపల్లి, కుమ్మరపల్లి గ్రామాలలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆర్‌డిఒ మాట్లాడుతూ గతంలో పట్టాదారు పాస్ పుస్తకాల పైన నాయకుల ఫోటోలు ఉండవని ప్రభుత్వ రాజ ముద్రతో పట్టాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. గ్రామాల్లో ఇటీవల జరిగిన భూముల రీసర్వే ప్రకారం పుస్తకాలు ముద్రించినట్లు తెలిపారు. ఎక్కడైనా తప్పు జరిగి ఉంటే వెంటనే అర్జీ పెట్టుకొని సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. మండలంలో 750 పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరయ్యాయని బండపల్లిలో13, కుమ్మరిపల్లి 37, పోత్తు కూరుపల్లి 209 పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల టిడిపి అధ్యక్షుడు గాలివీడు సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. డిటి కృపావతి, ఆర్ఐ సమ్మద్, టిడిపి నాయకులు సహదేవరెడ్డి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, విఆర్ఒలు కవిత, యామిని, గ్రామ ప్రజలుపాల్గొన్నారు. **కలికిరి :** రెవిన్యూ సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని త్హశీల్దార్ హరికుమార్ తెలిపారు. మండలంలోని చీకటిపల్లి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించారు. మండలంలో ఇటీవల జరిగిన రీసర్వే చేసిన భూములకు రాజ ముద్రలతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అర్హులైన రైతులతో ఇకెవైసి చేసుకుని పంపిణీ చేశారు. రైతులకు ఎలాంటి సమస్యలున్నా త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని, జాయింట్ ఎల్‌పిఎంలు ఉంటే సర్వే కి కట్టుకొని సర్వేయర్ ద్వారా వెంటనే సరి చేసుకోవాలని రైతులకు సూచించారు. మండల టిడిపి అధ్యక్షుడు షాబుద్దీన్ మాట్లాడుతూ రైతుల రెవిన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో విఆర్ఒలు నారాయణ, ప్రసాద్ రెడ్డి, విఆర్ఎలు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని ఊటుకూరు వెంకటపల్లి గ్రామంలో కొత్తగా వచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలను శుక్రవారం తిరుపతి ఆర్‌డిఒ రామ్మోహన్ పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ఊటుకూరు వెంకటం పల్లి గ్రామంలో పూర్తి కావడంతో రైతుల కు బయోమెట్రిక్ ద్వారా అందించారు. రానున్న రోజుల్లో రీ ర్వే పూర్తయిన ప్రతి గ్రామంలోనూ రాజ ముద్రతో కలిగిన పాస్‌బుక్‌లను రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని ఆర్‌డిఒ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ పుల్లారెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, టిడిపి నాయకులు కృష్ణమ నాయుడు, నాగరాజు పాల్గొన్నారు. **వీరబల్లి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజముద్ర కలిగిన పట్టా దారు పాసుపుస్తకాల పంపిణీతో పాసుపుస్తకాలకు పూర్తి భద్రత కలిగిందని మండల టిడిపి అధ్యక్షులు భానుగోపాల్ రాజు అన్నారు. మండలంలోని ఓదివీడు గ్రామ సచివాలయంలో తహశీల్దార్ ఖాజాబీతో కలిసి ఆయన రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని పట్టాదారు పాస్ పుస్తకాలను పొందారు. కార్యక్రమంలో డిటి నరేందర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకట రామరాజు, సీనియర్ నాయకులు రామ్మోహన్‌రాజు, రామచంద్ర రామాంజనేయులు, సుధాకర్, సిద్దిరాజు, సుబ్బరామరాజు పలువురు రైతులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సచివాలయంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామంలో 655మంది రైతులకు అందించామని తహశీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప రెడ్డి, సురేంద్ర, భూమిరెడ్డి, భాస్కర్ రెడ్డి, సిద్ధారెడ్డి పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండలంలోని బాగంపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ శ్రీలతమ్మ ఆధ్వర్యంలో పట్టాదారు పాసు పుస్తలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాజముద్ర కలిగిన పాసు పుస్తకాలు ఇవ్వడం పట్ల రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్‌చాంద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్‌నాయుడు, మండలాధ్యక్షులు రమేష్‌నాయుడు, రామనాథరెడ్డి, విఆర్ఒ రవిశంకర్ రైతులు పాల్గొన్నారు.


సుండుపల్లి :పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్న సర్పంచ్ శ్రీలతమ్మ


5న ప్రత్యేక గ్రామసభలు


ప్రజాశక్తి-పీలేరు : పీలేరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలోనూ ఈనెల 5న ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని ఎంపిడిఒ శివశంకర్ తెలిపారు. శుక్రవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి అధికారులతో ఎంపిడిఒ శివశంకర్, ఎపిఒ అశోక్‌రెడ్డి కలిసి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వారు ప్రత్యేక గ్రామసభల అజెండాను వివరించారు. ముఖ్యంగా గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా అభివృద్ధి చేయడంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వికసిత భారత్, గ్రామీణ రోజ్గార్ అజీవిక మిషన్ (గ్రామీణ)-2025 చట్టం పై గ్రామస్థులకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ అంశాలపై గ్రామసభలలో ప్రజా ప్రతి నిధులు, రైతులు, మహిళలు, కూలీలు తదితర వర్గాలకు సమగ్రంగా అవగాహన కల్పించాలని గ్రా మ పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామాల సమగ్ర అభి వృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎం తో కీలకమని, ప్రతి ఒక్కరూ గ్రామసభల్లో పాల్గొని ప్రభుత్వ పథకాలపై స్పష్టత పొందాలని తెలిపారు.


జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఎస్‌పి కార్యాలయానికి సిద్ధమవుతున్న రేస్ భవనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లి కేంద్రంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా ఎస్‌పి కార్యాల యానికి రేస్ భవనం వేగవంతంగా సిద్ధమవుతోంది. జెసిబిలతో శుక్రవారం యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య, అభివృద్ధి పనులు ప్రారంభించారు. బెంగళూరు రోడ్డులోని రేస్ బిఇడి కళాశాల భవనాన్ని ఎస్‌పి కార్యాల యంగా ఎంపిక చేసిన అధికారులు, పరిసరాలను సుందరంగా మార్చేందుకు చర్యలు చేపట్టారు. కళాశాల ఆవరణలో ఉన్న చెట్లు, ముళ్ల పొదలను జెసిబి సహా యంతో తొలగించారు. జిల్లా పోలీస్ కార్యాలయం త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది.


భవనం పరిసరాలను జెసిబితో శుభ్రం చేయిస్తున్న పోలీసు సిబ్బంది


కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో ఎడిఇ, ఎఇ

సమస్యల పరిష్కారం కోసమే కరెంటోళ్ల జనబాట

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి పంచాయతీలో శుక్రవారం విద్యుత్ శాఖ ఎడి మురళీ ధర్‌రెడ్డి, ఎఇ పత్తిపాటి కుమార్‌నాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఇంటింటికి తిరిగి గృహ విద్యుత్ వినియోగదారులకు, వ్యవసాయ రైతులకు ఉన్న సమస్యలను తెలుసుకుని వినియోగదారుల వివరాలు సేకరించి ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు పక్కకు వాలిన, విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదం అంచులో ఉన్న వాటిని అంచనా వేసి వీలైనంత త్వరలో సమస్య లేకుండా చేస్తామని పేర్కొన్నారు. ఎడి ఈ మాట్లాడుతూ రైతుల సమ స్యలను ఇంటికి వెళ్లి తెలుసుకొని పరిష్కరిస్తామనిచెప్పారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ పుల్లంపేట ఎఇ రైతులకు ఎదురయ్యే విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కారం చూపుతున్నారని అభినందించారు. కార్యక్రమంలో లైన్‌మేన్ రైతులు పాల్గొన్నారు.

పిటిఎం శివప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె జిల్లా కేంద్రం ఏర్పాటు లో ప్రధాన భూమిక పోషించిన జిల్లా సాధన కమిటీ కన్వీనర్ పిటిఎం శివప్రసాద్‌ను శుక్రవారం బాస్ కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, పీలేరుకు చెందిన ప్రజా సంఘాల నాయకులు మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య, ఎంఎస్‌సి సీనియర్ నాయకులు నడిమి కంద్రిక సుధాకర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పిటిఎం శివప్రసాద్ మదనపల్లె జిల్లా సాధన కోసం 633 రోజులు ఉద్యమం చేయడం గొప్ప విషయమన్నారు. మదనపల్లి జిల్లా కేంద్రం ఆవశ్యకతమై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అసెంబ్లీలో ప్రజల వాణిని బలంగా వినిపించారన్నారు. అందరి సహకారంలో జిల్లా కేంద్రం కల సాకారమైందన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి సంఘ నాయకులు ఇరపలపాటి ఆంజనేయులు, కిన్నెర తిమ్మయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.


శివప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

మున్సిపాల్టీలో లే అవుట్ల క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట : మున్సిపాలిటీ పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.వి.పల్లవి తెలిపారు.ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెం.885/2,4పిలో గల 1.34 ఎకరాల భూమికి క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. లేఅవుట్ క్రమబద్ధీకరణకు సంబంధించిన మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు లేదా ఇతర సూచనలు ఏవైనా ఉన్నట్లయితే,అవి ఏడు రోజులలోపు తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ సూచించారు. ఈ అవకాశాన్ని నగర పంచాయతీ ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యూరియా పంపిణీని పర్యవేక్షించిన ఎఒ

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు మండల వ్యవసాయ అధికారిణి ఒ.రమాదేవి శుక్రవారం ప్రయివేట్ ఎరువుల డీలర్ల దుకాణాల్లోని యూరియా పంపిణీని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ యూరియా తలుపుల-1, తలుపుల-2, దొడ్డిపల్లి, రైతు సేవా కేంద్రాల్లో, కిసాన్ అగ్రి క్లినిక్, తలుపులలోని అన్నమయ్య రైతు మ్యాక్స్ లిమిటెడ్, అన్నపూర్ణ సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ప్రయివేట్ డీలర్ల షాపుల్లో 85 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు పంటలకు సరైన దశలో, సరైన మోతాదులో వేసుకుని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పీలేరు, తలుపుల ప్రైవేట్ డీలర్ల దగ్గర ఎరువులు తీసుకునే రైతులు తమ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి తమ పంటలకు సరిపడా యూరియాకు టోకెన్లు తీసుకుని వెళ్లాలని తెలిపారు.


ఎరువుల దుకాణంలో యూరియాను పరిశీలిస్తున్న ఎఒ రమాదేవి

క్రైం కార్నర్

బొలెరో ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బొలేరో వాహనం ఢీకొని రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. బి.కొత్తకోట మండలం, కనికలతోపుకు చెందిన రైతు సి.లోకేశ్వర్ సొంత పనిమీద ద్విచక్రవాహనంలో అంగళ్లుకు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలోని కంటేవారిపల్లె వద్ద కదిరి వైపు నుంచి మదనపల్లె వైపు వెళ్తున్న బొలెరో వాహనం రైతు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రైతును స్థానికులు వెంటనే కారులో మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-కలికిరి

ఆటో అదుపు తప్పి బోల్తా పడి ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..గురువారం సమయంలో గండబోయినపల్లికి చెందినా షేక్ ఇంతియాజ్(35) ఒంటిల్లు నుంచి కలికిరికి ఆటో తోలుకుంటూ వస్తూ మార్గ మధ్యలో పల్లెల వారిపల్లి సమీపం లో రోడ్ మలుపు వద్ద ఆటో వేగంగా వస్తూ ఆ ఆటోను అదుపుచేయలేక ప్రమాదవశాత్తు ఆటో బొల్తాపడి మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య షెహనాజ్ ఫిర్యాదు ఇవ్వగా సిఐ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మదనమోహన్‌రెడ్డి తెలిపారు.

వైసిపి కార్యకర్తపై గుర్తుతెలియని దుండగుల దాడి

ప్రజాశక్తి-రామాపురం

వైసిపి కార్యకర్త రామచంద్రరెడ్డిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ చెరువు ముందరపల్లె గ్రామానికి చెందిన మాన్పురి రామచంద్రరెడ్డి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అనుచరుడిగా వైసిపి కార్యకర్తగా ఉన్నాడని తెలిపారు. శుక్రవారం తన పొలం వద్ద ఉండగా గుర్తు తెలియని ఏడుగురు దుండగులువచ్చి తనపై దాడి చేశారని చుట్టుపక్కల పొలాలలోని మహిళలు గట్టిగా అరువులు కేకలు వేయడంతో వదిలేసి వెళ్లినట్లు ఫిర్యాదులు పేర్కొన్నట్టు ఆయన తెలిపారు. ఈ దాడిలో రామచంద్ర రెడ్డికి రెండు చేతులు తీవ్ర గాయాలు అయినట్లు పేర్కొన్నారు. గాయాలతో ఉన్న వ్యక్తిని తన కుటుంబీకులు 108లో కడప రిమ్స్ కు తరలించారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.